క్లుప్తంగా

పేదలకు దీపావళి కిట్ల పంపిణీ



ఆటో డ్రైవర్లకు దీపావళి ఫ్యామిలీ ప్యాక్ కిట్లు అందజేస్తున్న కృష్ణార్జున

రాజాం: దీపావళి పండగ సందర్భంగా పట్టణంలోని జేఎల్‌కే టైల్స్ కృష్ణార్జున 300 మంది పేదలు, ఆటో డ్రైవర్లు, టైల్స్ వర్కర్లు, తాపీ మేస్త్రీలకు బాణసంచా ఫ్యామిలీ ప్యాక్‌లు శనివారం అందించారు. ప్రతీ ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా తన తండ్రి జగన్నాథరావు పట్నాయక్ జ్ఞాపకార్థం వీటిని పేదలకు అందించామని కృష్ణార్జున తెలిపారు.

అనారోగ్యంతో పీఏసీఎస్ అంటెండర్ మృతి



పత్తికాయల అప్పారావు (ఫైల్)

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట పీఏసీఎస్ అటెండర్‌గా పనిచేస్తున్న పత్తికాయల అప్పారావు(56) అనారోగ్యంతో మృతి చెందినట్లు శనివారం ఆయన భార్య ఆదిలక్ష్మి, కుమారుడు గణపతి తెలిపారు. పలువురు గ్రామ పెద్దలు,మండల ప్రజాప్రతినిధులు అప్పారావు భౌతికాయానికి నివాళలర్పించారు. కుటుంబ సభ్యులకు ఆస్పత్రి సిబ్బంది సంతాపం తెలిపారు.

హరిత దీపావళికి ప్రాధాన్యతనిద్దాం



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

బొబ్బిలి: ప్రతి ఒక్కరూ హరిత దీపావళికి ప్రాధాన్యతనిచ్చి కాలుష్య, శబ్ద రహిత పండగను జరుపుకోవాలని గ్రీన్‌బెల్ట్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.వి.రమణ మూర్తి,యూటీఎఫ్ రాష్ట్రనాయకురాలు కె. విజయగౌరి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ జంక్షన్‌లో హరిత దీపావళి పండగపై శనివారం అవగాహన కల్పించారు. ఫ్లకార్డులు చేతపట్టి హరిత దీపావళిపై ప్రజలకు సూచనలు చేశారు. మతాబులతో కాకుండా దీపాలతోనే పండగ చేసుకోవాలన్నారు. కె.కృష్ణదాసు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీపట్టా భూముల పరిశీలన



డీపట్టా భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ హేమంత్‌కుమార్

తెర్లాం: మండల కేంద్రంలోని డీపట్టా, ప్రభుత్వ భూములను తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ శనివారం పరిశీలించారు. గ్రామంలో డీపట్టా, ప్రభుత్వ భూములు ఎక్కడ ఉన్నాయి, వాటి స్వరూపం ప్రస్తుతం ఏవిధంగా ఉంది, ఎవరి ఆక్రమణలోనైనా ఉన్నాయా, ఖాళీగా ఉన్నాయా అనేది పరిశీలించారు. ప్రధాన రహదారికి పక్కనే ఉన్న డీపట్టా, ప్రభుత్వ భూములను గుర్తిస్తున్నామని, ప్రభుత్వానికి అవసరమైనప్పుడు వాటిని వినియోగించేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ కృష్ణమూర్తినాయుడు, వీఆర్‌ఓలు డి.రాము, ఎస్.శ్రీనివాసరావు, సుధాకర్, గ్రామ సర్వేయర్ శర్వాణి, తదితరులు ఉన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



స్పోర్ట్స్‌మీట్‌లో విజేతలుగా నిలిచిన చిన్నారులు, నిర్వాహకులతో డీఎస్పీ భవ్యారెడ్డి

బొబ్బిలి: విద్యార్థులు, యువత తమ దైనందిన జీవితంలో క్రీడలకు ప్రాధాన్యతనివ్వడం వల్ల మానసికోల్లాసం కలిగి చదువు, కెరీర్ గైడెన్స్‌తో ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చని డీఎస్పీ జి.భవ్యారెడ్డి అన్నారు. శనివారం స్థానిక వీరబొబ్బిలి క్రీడామైదానంలో స్థానిక స్పోర్ట్స్ రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షుడు, జాతీయ క్రీడాకారుడు రావు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం ఉదయం చిల్డ్రన్స్ స్పోర్ట్స్‌మీట్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అతి థిగా విచ్చేసిన డీఎస్పీ భవ్యారెడ్డి విద్యార్థులకు క్రీడల వల్ల ఎంతటి ప్రయోజనాలున్నా యో వివరించి వారిని చైతన్యం చేశారు. క్రీడాపోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు, షీల్డ్స్, సర్టిఫికెట్లు అందజేశారు.

అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు

రాజాం సిటీ: అనుమతులు లేకుండా దీపావళికి బాణసంచా విక్రయించవద్దని రాజాం టౌన్ సీఐ కె.అశోక్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాల్లో కాని, రోడ్డు పక్కన ప్రభుత్వ అనుమతులు లేకుండా బాణసంచా విక్రయించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలా విక్రయించిన వారి నుంచి మందుగుండు స్వాధీనం చేసుకోవడంతోపాటు కేసులు నమోదుచేస్తామని స్పష్టం చేశారు.

ఆకట్టుకునే ఆకృతుల్లో మట్టి ప్రమిదలు

- దీపావళి పండగ నేపథ్యంలో జోరుగా మట్టి ప్రమిదల విక్రయాలు
- విభిన్న ఆకారాల్లో ప్రమిదలు



రాజాంలో గాయత్రీకాలనీవద్ద మట్టి ప్రమిదల విక్రయాలు



రాజాం: దీపాల పండగ దీపావళి వచ్చేసింది. ఈ పండగ రోజు ఎంత బాణ సంచా కాల్చినప్పటికీ ప్రధానంగా మట్టి ప్రమిదలకే అధిక ప్రాధాన్యత ఉంటుంది. ప్రతి ఇల్లు, ప్రతీ దేవాలయంలో మట్టి ప్రమిదల్లో దీపారాధన చేస్తుంటారు. మహిళలు మట్టి ప్రమిదలతో దీపాలు వెలిగించి, ఇంటి ముంగిట అలంకరిస్తారు. కార్తికమాసంలో కూడా దేవాలయాల్లో నిత్యం దీపారాధన చేస్తుంటారు. దీపావళి పండగ అనంతరం కార్తికమాసం ప్రారంభమవుతుంటుంది.ఈనేపథ్యంలో మట్టి ప్రమిదలకు మంచి గిరాకీ పలుకుతోంది. మార్కెట్‌లో కొత్త హంగులతో, విభిన్న ఆకృతుల్లో మట్టి ప్రమిదలు దర్శనమిస్తున్నాయి. దీపావళి పండగకు పదిహేను రోజుల ముందు నుంచే రాజాం పట్టణం కుమ్మరి వీధికి చెందిన కుమ్మరులు మట్టి ప్రమిదలను తయారు చేసి, విక్రయాలకు సిద్ధం చేస్తుంటారు. ప్రస్తుతం గాయత్రీకాలనీ, మాధవబజార్, పాలకొండ రోడ్డులో వీటిని విక్రయిస్తున్నారు.

కొనుగోలుదారుల అభిరుచి మేరకు..

గతంలో మాదిరిగా మట్టి ప్రమిదలు ఇప్పుడు సాదాసీదాగా ఉండడం లేదు. కొనుగోలుదారుల అభిరుచి మేరకు కంపెనీ ఆర్చీలతో విభిన్నరీతిలో తయారు చేశారు. గుండ్రంగా, ఏక ముఖ, త్రిముఖ, పంచ ముఖ కోనె ఆకారాలతో పాటు దమరుకం, గోపురం వంటి ఆకారాల్లో మట్టి ప్రమిదలు దర్శనమిస్తున్నాయి. పలు రంగులతో, విభిన్న ఆకృతుల్లో ఉండడంతో వీటిని కొనుగోలు చేసేందుకు కొనుగోలు దారులు ఆసక్తి కనబరుస్తున్నారు. పది రూపాయలకు పన్నెండు ప్రమిదలు చొప్పున విక్రయిస్తున్నారు. వినూత్నంగా, పెద్దవిగా ఉన్న ప్రమిదలు డజన్ రూ. 20 వరకు ధర పలుకుతున్నాయి.

చుట్టుపక్కల మండలాలన్నీ ఇక్కడే..

రాజాం పట్టణంలో మట్టిప్రమిదలకు డిమాండ్ ఉంటుంది. సంతకవిటి, రేగిడి మండలాల్లో వీటిని తయారు చేసేవారు ఉన్నప్పటికీ వ్యాపారం మాత్రం రాజాంలోనే అధికంగా ఉంటుంది. మట్టి ప్రమిదల్లో నాణ్యత, ఆకారం ఆధారంగా వీటికి డిమాండ్ ఉంటుంది. రాజాంకు చెందిన కుమ్మరులతో పాటు తోపుడు బండ్ల వ్యాపారులు వీటిని ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి విక్రయాలు చేస్తున్నారు. రాజాం చుట్టు పక్క మండలాలకు చెందిన వేలాదిమంది రాజాంలో లభించే మట్టి ప్రమిదలను కొనుగోలుచేసి తమ ఇండ్లకు తీసుకెళ్తున్నారు.

బాణసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి



అగ్నిమాపక శాఖ అధికారి పైల అశోక్

రాజాం: దీపావళి సందర్భంగా బాణసంచా కాల్చే సమయంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని రాజాం అగ్నిమాపక శాఖ అధికారి పైల అశోక్ సూచించారు. స్థానిక ఫైర్ స్టేషన్ వద్ద శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిన్నారులను టపాసులకు దూరంగా ఉంచాలని, పేలే వస్తుసామగ్రి అందించవద్దని చెప్పారు. కేవలం క్రాకర్స్ మాత్రమే పెద్దల సమక్షంలో దూరంగా ఉండి చిన్నారులు వెలిగించేలా చూడాలని తెలిపారు. బాణసంచా కాల్చే సమయంలో దగ్గర్లో ఇసుక, నీటిని అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు. కాటన్ వస్త్రాలు ధరిస్తే అగ్ని ప్రమాదాలు తక్కువగా ఉంటాయని వెల్లడించారు. గ్రామాల్లో గడ్డివాములు, పూరి పాకలు ఉన్న ప్రాంతాల్లో ముం దస్తుగా జాగ్రత్తలు పాటించాలని, భారీ శబ్దం వచ్చే టపాసులు కాల్చవద్దని హితవు పలికారు. ఏవైనా ప్రమాదాలు సంభవిస్తే 51099 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నియోజకవర్గంలో దుకాణాలకు అనుమతులు

దీపావళి పండగ సందర్భంగా నియోజకవర్గంలో 11 తాత్కాలిక బాణ సంచా దుకాణాలకు అనుమతులు ఇచ్చామని అగ్నిమాపక శాఖ అధికారి వెల్లడించారు. రాజాం మండలంలో ఏడు, సంతకవిటిలో రెండింటింటికి, రేగిడి, వంగర మండలాల్లో ఒక్కొక్క దుకాణానికి నో అబ్జెక్షన్ ఇచ్చామని, రెవెన్యూ, పోలీస్ అధికారులు సైట్ వెరిఫికేషన్ చేశారని పేర్కొన్నారు. రేకులు షెడ్డుల్లో షాపులు పెట్టాలని, షాపుల వద్ద డ్రమ్స్‌తో నీరు, ఇసుక సిద్ధం చేయాలని, చిన్నారులను షాపులు వద్ద ఉంచరాదని దుకాణాల యజమానులకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే అనుమతులు రద్దుచేయడంతో పాటు బాణసంచా సామగ్రిని సీజ్ చేస్తామని హెచ్చరించారు.

‘స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర’ను బహిష్కరిస్తున్నాం



స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో నిరసన తెలుపుతున్న ఫ్యాప్టో నేతలు

రామభద్రపురం: ఫ్యాప్టో పిలుపు మేరకు పాఠశాలల్లో ప్రతీ నెల మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నామని ఫ్యాప్టో రాష్ట్ర నాయకుడు జె.సి.రాజు అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ఉపాధ్యాయులు నిరసన తెలిపారు.ఈసందర్భంగా జె.సి.రాజు మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం ఫొటోలు, అందుకు సంబంధించిన గూగుల్ పత్రాలను ఆన్‌లైన్‌లో పంపించబోమని చెప్పారు. అలాగే మరుగుదొడ్ల పరిశీలన ఫొటోలు కూడా పంపించమని అన్నారు.అత్యవసరమైన పీఆర్‌సీ, ఐఆర్ డీఏలు,యాప్‌ల సమస్యను తదితర డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించేంత వరకు బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తూ దశల వారీ పోరాటాలు చేస్తామన్నారు. ఫ్యాప్టో పిలుపు మేరకు ఉపాధ్యాయులు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు.ఫ్యాప్టో నేతలు బి.రవి.కుమార్,సుధాకర్, కర్రి శ్రీనివాసరావు, కృష్ణంనాయుడు, లక్ష్మణరావు,వేణు, వేణుగోపాలరావు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ని నియమించాలని వినతి



ఎంపీడీఓ రాజారావుకు వినతిపత్రం అందజేస్తున్న ఎం.సీతారాంపురం గ్రామస్తులు

వంగర: తమ గ్రామానికి ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాలని ఎం. సీతారాంపురం గ్రామ నాయకులు పలువురు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ టి.రాజారావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. అయిదు నెలల క్రితం గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ కాంబోతుల వాసు రాజీనామా చేశారని, ఆయన స్థానంలో ఇంత వరకు మరొకరిని నియమించకుండా ఏపీఓ నిర్లక్ష్యం చేస్తున్నా రని ఎంపీడీఓకు వివరించారు. గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోవడంతో ఉపాధి హామీ పనులు జరగడం లేదని చెప్పారు. వినతిపత్రం అందజేసిన వారిలో రాజీనామా చేసిన ఫీల్డ్ అసిస్టెంట్ వాసు ఉండడం విశేషం. ఆ గ్రామ నాయకులు లెంక సింహాచలం, కాంబోతుల ఉమామహేశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యకర జీవనం



మాట్లాడుతున్న బీఆర్‌ఏయూ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ వనజ

రాజాం సిటీ: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యపడుతుందని, ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.వనజ అన్నారు. స్వచ్ఛత యాక్షన్ ప్లాన్‌లో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై శనివారం అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక బస్టాండ్ ఆవరణను 200 మంది విద్యార్థులతో కలిసి శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడికక్కడే చెత్తాచెదారాలు నిండి ఉండడం తో స్వచ్ఛమైన గాలి, వాతావరణం కరువైందని, దీంతో ప్రజలు రోగాల బారినపడుతున్నారని అన్నారు. హైదరాబాద్‌కు చెందిన రీజనల్ ఎన్ఎస్ఎస్ డైరెక్టర్ ఎన్.సంజీవయ్య మాట్లాడుతూ వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రజలు వ్యక్తిగత వాహనాలకు బదులుగా ప్రజారవాణా సాధనాలను వినియోగించాలని సూచించారు. ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలని తెలిపారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.స్వప్నహైందవి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లు డి.రామారావు, కె.జనార్దనరావు, ఎన్ఎస్ఎస్ పీఓలు వై.భాస్కరరావు, బి.గోపి, సామాజిక కార్యకర్త పెంకి చైతన్యకుమార్ పాల్గొన్నారు.

గృహాధారిత విద్యను సక్రమంగా అందించాలి

తెర్లాం: శారీరక, మానసికంగా బాధపడుతూ గ్రామాల్లో ఇంటి వద్ద ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులకు సహిత విద్య ఉపాధ్యాయులు గృహాధారిత విద్యను సక్రమంగా అందించాలని ఎంఈఓ జె.త్రినాథరావు సూచించారు. కూనాయవలసకు చెందిన ప్రత్యేక అవసరాల విద్యార్థి టి.నితిన్ అనే విద్యార్థి ఇంటికి శనివారం వెళ్లి పరిశీలించారు. విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడి పలు వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం సహిత విద్యా విభాగం ద్వారా హోంబేస్డ్ విద్యార్థులకు ఎన్నో సౌకర్యాలు కల్పిస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు వారిని సహిత విద్యా కేంద్రాలకు తీసుకువెళ్లేందుకు అలవెన్స్‌లు అందజేస్తుందన్నారు. ఆయన వెంట సహిత విద్య ఉపాధ్యాయుడు సూర్యారావు ఉన్నారు.

డీజే సౌండ్లతో ప్రమాదాలు జరిగితే చర్యలు



డీజే సిస్టం యజమానులకు సూచనలు చేస్తున్న సీఐ సతీష్ కుమార్

బొబ్బిలి: డీజే సిస్టంల ద్వారా పరిమిత డెసిబుల్స్‌కు మించి శబ్దం కలిగిస్తే చట్టప్రకారం డీజేల యజమానులపై చర్యలు తీసుకుంటామని సీఐ కె.సతీష్ కుమార్ అన్నారు. శనివారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో డీజే సౌండ్ సిస్టం యజమానులతో సమావేశం నిర్వహించారు. వివిధ శుభ కార్యాలు,ప్రత్యేక సందర్భాల్లో డీజేలు ఏర్పాటు చేసేటప్పుడు శబ్ద కాలుష్యాన్ని సృష్టించొద్దన్నారు.

ప్రజల సంపదపై ప్రైవేటు పెత్తనమే పీపీపీ



మాట్లాడుతున్న ప్రజాసంఘాల కన్వీనర్ రామ్మూర్తినాయుడు

రాజాం సిటీ: ప్రజల సంపదపై ప్రైవేటు పెత్తనమే పీపీపీ విధానమని ప్రజాసంఘాల కన్వీనర్ సీహెచ్.రామ్మూర్తినాయుడు అన్నారు. రాజాంలో శనివారం నిర్వ హించిన ప్రజాసంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్రానికి 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు మంజూరు కాగా వాటిలో అయిదు కళాశాలలను గత ప్రభుత్వం ప్రారంభించిందని గుర్తుచేశారు. పది కళాశాలల పనులు వివిధ దశల్లో ఉండగా టీడీపీ కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటు పరం చేయాలని చూస్తోందని, ఇది సరికాదని అన్నారు. ప్రభుత్వం కొంత పెట్టుబడి పెడితే ఆ కళాశాలల పనులు రెండు మూడేళ్లలో పూర్తిచేయగలిగే అవకాశం ఉన్నప్పటికీ డబ్బులు లేవన్న సాకుతో వాటిని ప్రైవేటు కంపెనీలకు దారాదత్తం చేస్తున్నారని మండిపడ్డారు.ప్రభుత్వ నిర్ణయంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రావడంతో మెడికల్ కళాశాలలను తాము ప్రైవేటు పరం చేయడంలేదని, యాజమాన్యం ప్రభుత్వరంగంలోనే ఉంటుందని ముఖ్యమంత్రితో సహా కూటమి నాయకులు స్వరం మార్చుతున్నారని పేర్కొన్నారు. కూటమి మంత్రుల పొంతనలేని మాటలే ప్రజలను మోసం చేస్తున్నాయనడానికి నిదర్శనమని అన్నారు. ప్రభుత్వ రంగంలోనే విద్యా, వైద్య, ప్రజారోగ్య వ్యవస్థలు కొనసాగాలని, ప్రభుత్వ వైద్యకళాశాలలు ప్రైవేటుకు అప్పగించవద్దని, పీపీపీ విధానం వెనక్కి తీసు కోవాలని డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరం అయితే ఫీజులు కట్టుకోలేక పేద విద్యార్థులు వైద్యవిద్యకు దూరమవుతారని అన్నారు. మరోవైపు ఆరోగ్యశ్రీ బకాయిలను ప్రైవేటు ఆస్పత్రులకు చెల్లించకపోవడం వల్ల ఆరోగ్యశ్రీ సేవలు అందక పేదలు ఇబ్బందులు పడుతున్నారని, పీహెచ్‌సీ వైద్యుల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో వారు 20 రోజులుగా సమ్మెలో ఉన్నారని అన్నారు. ప్రభుత్వ చర్యల వల్ల ప్రజారోగ్యం నిర్వీర్యం అవుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ విధానాలను మార్చుకోకపోతే పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ప్రజాసంఘాల నాయకులు సత్యారావు, సూర్యారావు, శ్రీనివాసరావు, ఆనంద్, చిన్నారావు, సురేష్, త్రినాథ్, రామమూర్తి, లక్ష్మి, కాంతమ్మ, చిన్నమ్మడు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

- వైఎస్సార్‌సీపీ ప్రాథమికస్థాయి పరిశీలకులకు శంబంగి దిశానిర్దేశం

బొబ్బిలి: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పల నాయుడు పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో శనివారం సమావేశం నిర్వహించి గ్రామ, వార్డు స్థాయిల్లో కమిటీలు, అనుబంధ కమిటీల ఏర్పాటుకు పరిశీలకులను నియమించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పరిశీలకుడు రెండు గ్రామాలను పరిశీలించి అక్కడి నాయకులు, ప్రజాప్రతి నిధులను సమన్వయం చేసుకుని కమిటీ నిర్మాణంలో పాలుపంచుకుని, పార్టీ నాయకులకు సిఫార్సు చేయాలన్నారు. కమిటీలు, అనుబంధ కమిటీల సభ్యుల పేర్లను అధిష్టానం సూచిస్తుందన్నారు.

కోటి సంతకాల కార్యక్రమం జయప్రదం కావాలి

మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరిస్తున్న కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో చేపడుతున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నియోజకవ ర్గంలో జయప్రదం చేయాలని శంబంగి కార్యకర్తలు, నాయకులకు సూచించారు. పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు మెరుగైన, వైద్యం, పేద విద్యార్థుల వైద్య విద్య కోసం జగన్ మోహన్ రెడ్డి తీసుకువచ్చిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రైవేటు పరం చేయడాన్ని ప్రజలంతా ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్నారని, వారి వ్యతిరేకతను ప్రపంచానికి చాటాలన్నారు. ఇందుకోసం అన్ని గ్రామాల్లో నాయకులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో సంతకాల సేకరణను ప్రతిష్టాత్మకంగా చేపట్టాలన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఇంటి గోపాలరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి శంబంగి వేణుగోపాలనాయుడు, సీనియర్ నాయకులు తూముల భాస్కరరావు, పట్టణ, మండల అధ్యక్షులు చోడిగంజి రమేష్ నా యుడు, తమ్మిరెడ్డి దామోదరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు ఎస్.వి. మురళీ కృష్ణారావు, గొలగాని రమాదేవి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బొద్దల సత్యనారాయణ,సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.


అభినందన



విద్యార్థిని పూజితను అభినందిస్తున్న ఎంఈఓ ప్రవీణ్‌కుమార్

రాజాం సిటీ: మండల పరిధి పొగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి అండర్-17 క్రికెట్ పోటీలకు ఎంపికైన ఆబోతుల పూజితను ఎంఈఓ పి.ప్రవీణ్‌కుమార్ శనివారం అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో కూడా చక్కని ప్రతిభ కనబరిచి పాఠశాలకు, మండలానికి మంచి పేరుతీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థినిని అభినందించిన వారిలో హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయులు సత్యారావు, దాలినాయుడు, శ్రీనివాసరావు, సంతోషిమాత, త్రినాథ్, కాశీనాయుడు తదితరులు ఉన్నారు.

బాణసంచా దుకాణాల పరిశీలన



దుకాణ నిర్వాహకులకు సూచనలు చేస్తున్న డీఎస్పీ భవ్యారెడ్డి

బొబ్బిలి: పట్టణంలోని తాత్కాలిక బాణసంచా దుకాణాలను డీఎస్పీ జి.భవ్యారెడ్డి శనివారం సాయంత్రం పరిశీలించారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా జాగ్రత్తపడాలని, దుకాణాల వద్ద ఇసుక, నీరు సిద్ధంగా ఉంచుకోవాలని యజమానులకు సూచించారు.

మెనూలో లోపాలుంటే సహించేదిలేదు



ఎం.ఆర్ అగ్రహారంలో మధ్యాహ్న భోజన వంటకాలను పరిశీలిస్తున్న ఎంఈఓలు

తెర్లాం: మధ్యాహ్న భోజన పథకంలో మెనూ సక్రమంగా అమలు చేయాలని, మెనూ అమలులో లోపాలుంటే నిర్వాహకులపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడేదిలేదని ఎంఈఓలు త్రినాథరావు, పాపారావు హెచ్చరించారు. మండలంలోని ఎం.ఆర్.అగ్రహారం, కాలం రాజుపేట పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాలను ఎంఈఓలు శనివారం పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంటకాలను రుచి చూశారు. వంట నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

వైఎస్సార్‌సీపీలో నూతన నియామకాలు

బొబ్బిలి: వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కమిటీలకు నూతన కార్యవర్గాలను నియమిస్తూ వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. బొబ్బిలి పట్టణ ఉపాధ్యక్షులుగా బలగ సాయికృష్ణ, దమ్మా అప్పారావులను నియమించారు. ప్రధాన కార్యదర్శులుగా సుంకరపల్లి వెంగళరావు, డోల రమేష్, గొలగాన జనార్దనరావు, దాసరి అప్పలరాజులను నియమించారు. అలాగే కార్యదర్శులుగా దేవ త్రినాథ,రుత్తల నాగేశ్వరరావు, మహాదేవ రాజారావు, తెంటు వెంకట రమణ, చల్లపల్లి అప్పారావు నియమితులయ్యారు. అలాగే నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కమిటీలతో పాటు ఎగ్జిక్యూటివ్ మెంబర్లను పార్టీ అధిష్టానం నియమించింది.

బొబ్బిలి మండల కమిటీ:

బొబ్బిలి మండల వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడిగా మీసాల శ్రీనివాసరావును నియమించారు. ప్రధాన కార్యద ర్శులుగా పోల సింహాచలం, చెలికాని రాజగోపాల్,గొట్టాపు శివాజీ, చిన్నం నాయుడు, శంబంగి నాయనోరి కన్నం నాయుడును నియమించారు.కార్యదర్శులుగా రెడ్డి సత్యనారాయణ, ఉత్తరావల్లి ధనుంజయ నాయుడు, బొత్స నటరాజ్, బొత్స పైడితల్లి, గొర్లె తిరుపతిరావు నియమితులయ్యారు.

బాడంగి మండల కమిటీ :

బాడంగి మండల కమిటీలో ఉపాధ్యక్షులుగా కంచిపాటి సూర్యనారాయణ, కురిటి సూర్యనారాయణలను నియమించారు. ప్రధానకార్యదర్శులుగా తెంటు శ్రీనివాసరావు, గొట్టాపు రామారావు, గండి శంకరరావు, తెంటు రామినాయుడు, కార్యదర్శులుగా కుప్ప సింహాచలం, బోను రవికుమార్, మరడ రమణ, కొట్టాన రవికుమార్ నియమితులయ్యారు.

తెర్లాం మండల కమిటీ:

తెర్లాం మండల ఉపాధ్యక్షులుగా మర్రాపు చిన్నంనాయుడు, బూరి మధుసూదనరావులను నియమించారు. ప్రధాన కార్యదర్శులుగా గుల్లిపల్లి శ్రీనివాసరావు,చప్ప ఈశ్వర రావు, గొండేల వెంకటరావు, కర్రి సత్యనారాయణ, కార్యదర్శులుగా బూరాడ తవిటినాయుడు, మజ్జి నరసింహారావు, కరణం సత్యారావు,శనపతి రాంబాబు, వావిలపల్లి ఆదినారాయణ నియమితులయ్యారు.

పాఠశాలల్లో ముందస్తు దీపావళి



రాజాం సిటీ: వివిధ వేషధారణలతో ఆకట్టుకున్న సన్ స్కూల్ విద్యార్థులు



సంతకవిటి: సంతకవిటిలోని వైజ్ స్కూల్‌లో క్రాకర్స్ కాల్చుతున్న విద్యార్థులు

రాజాం సిటీ/ సంతకవిటి: రాజాం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో, సంతకవిటి మండల కేంద్రంలోని వైజ్ స్కూల్, శేషాద్రిపురంలోని సంతోషి పబ్లిక్ స్కూల్‌లో శనివారం ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు విద్యార్థులకు దీపావళి పండగ గురించి, బాణసంచా కాల్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. విద్యార్థులు సాంప్ర దాయ వేషధారణలో వేడుకలకు హాజరయ్యారు.

శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకే..



రామభద్రపురం: చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టు ప్రశ్నా పత్రాలు విడుదల చేస్తున్న విజయగౌరి, ఉపాధ్యాయులు



తెర్లాం: ప్రశ్నాపత్రాలను విడుదల చేస్తున్న హెచ్ఎం రమేష్, ఉపాధ్యాయులు

రామభద్రపురం: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకే జన విజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్లు జేవీవీ ప్రతినిధి కె.విజయగౌరి తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వచ్చేనెల 1న మండల స్థాయి,మండల స్థాయిలో ప్రతిభ కనబరిచే వారికి వచ్చే నెల 23న జిల్లా స్థాయి పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లా స్థాయి విజేతలకు డిసెంబర్ 12,13,14 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీలు ఉంటాయని చెప్పారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రధానం చేస్తామని తెలిపారు. హెచ్‌ఎం వి.గోపాలనాయుడు,సైన్స్ టీచర్స్ చలపతి నాయుడు, ప్రభాకరరావు,రామారావు పాల్గొన్నారు.

తెర్లాంలో..

తెర్లాం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పం దన లభించింది. హెచ్‌ఎం ఎస్.ఎస్.ఎం.రమేష్, ఉపాధ్యాయులు ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు. ఈ పరీక్షకు పాఠశాలకు చెందిన 180మంది విద్యా ర్థులు హాజరయ్యారు. జనవిజ్ఞాన వేదిక సభ్యులు పాల్గొన్నారు.